మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

# ఓటు చోరీపై అప్రమత్తంగా ఉండాలి

- ఓటరు తన ఓటు కోల్పోకుండా బిఎల్వోలు జాగ్రత్త పడాలి
- ప్రజాస్వామ్యంలో ఓటుహక్కే కీలకం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- ఎస్ఐఆర్ పై ప్రత్యేక అవగాహన

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 16 ప్రభాతవార్త :** ప్రతి గ్రామంలో ఒక్క ఓటు కూడా ఎవరూ నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బిఎల్ఎ లకు పిలుపునిచ్చారు. స్థానిక సుదర్శన్ కన్వెన్షన్ హాల్‌లో టి పిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై బిఎల్ఎలకు అవగాహన శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ పేరుతో దేశంలోని కొన్ని రాష్ట్రాలలో లక్షలాది ఓట్లను తొలగించిన ఉదాహరణలు ఉన్నాయని ఆరోపించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలను ఉదాహరణగా చూపుతూ, ప్రజాస్వామ్యాన్ని –మిగతా4లో..

## సర్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే

# క్రిమినల్ చర్యలు

- ఓటర్ సవరణలో లోపాలు ఉండొద్దు
- నకిలీ ఓటర్లను తొలగించాలి
- ఎస్ ఐ ఆర్ ప్రక్రియ సమగ్రంగా నిస్పాక్షికంగా జరగాలి
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, జూన్ 16, ప్రభాతవార్త:** జిల్లాలో చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు, వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా, నిస్పాక్షికంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బూత్ లెవల్ సూపర్వైజర్లు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు తప్పులు లేని స్పష్టమైన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని అన్నారు. నకిలీ ఓటర్లు, మరణించిన వ్యక్తుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సవరించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి పౌరుని ఓటు హక్కును పరిరక్షించేందుకు ఈ ప్రక్రియ అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఓటర్ల ధృవీకరణ, మ్యాపింగ్ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పు నమోదులు, అనవసర తొలగింపులు జరగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలను ధృవీకరించిన తర్వాతే – మిగతా4లో..

# 25 ఎకరాలు.. రూ.300కోట్లు



నిర్మాణ పనుల కోసం భారీ ఎత్తున నిల్వ చేసిన ఇసుక

- రాయిచేడ్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పనులు ప్రారంభం
- ప్రభుత్వ విద్యలో నూతన అధ్యాయం
- అంతర్జాతీయ ప్రమాణాల విద్యా సంస్థ
- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు
- వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

**ఉప్పునుంతల, జూన్ 16 ప్రభాతవార్త :** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని రాయిచేడు గ్రామ శివారులో 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఈ విద్యా సంస్థను నిర్మాణ పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలకు ఈ ప్రాజెక్టు నిదర్శనంగా నిలవనుంది.

### పనులు వేగవంతం

ఈ ప్రాజెక్టుకు 2024 అక్టోబర్ 10న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి శంకుస్థాపన చేశారు. అనంతరం పరిపాలనా, సాంకేతిక ప్రక్రియలు పూర్తికాగా ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్మాణ పనులు వేగవంతం గా పుంజుకున్నాయి. ప్రస్తుతం నిర్మాణ స్థలంలో భారీ ఎత్తున పనులు కొనసాగుతున్నాయి. రాళ్లతో నిండిన గుట్టలను అధునాతన యంత్రాల సహాయంతో చదును పనులు చేస్తుండగా, వాహనాల రాకపోకలకు అవసరమైన అంతర్గత రహదారులను నిర్మించారు.

### సకల హంగులు

విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు కార్మికులకు తాత్కాలిక నివాస వసతులు ఏర్పాటు చేశారు. సమగ్ర సదుపాయాలతో విద్యా ప్రాంగణంఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆధునిక తరగతి గదులు, బాలురుబాలికల ప్రత్యేక హాస్టళ్లు, అత్యాధునిక గ్రంథాలయం, డిజిటల్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, భోజనశాలలు, ఆడిటోరియం, సిబ్బంది నివాస గృహాలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంకేతిక నైపుణ్యాల్లోనూ రాణించేలా ప్రణాళిక రూపొందించారు. నల్లమల్ల ప్రాంత విద్యార్థులకు వరం లాంటిదని చెప్పుకోవచ్చు. నియోజకవర్గంలో పి నల్లమల్ల అటవీ ప్రాంతానికి సమీపంలో ఈ పాఠశాల నిర్మాణం ప్రత్యేకత అని చెప్పవచ్చు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపన కే పరిమితం కాకుండా నిర్మాణ పనులను భౌతికంగా ప్రారంభించడం ద్వారా ప్రభుత్వం విద్యా అభివృద్ధి పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంటిగ్రేటెడ్ విద్య ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాయిచేడ్ గ్రామ సమీపంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కేవలం ఒక విద్యా సంస్థ కాదు... గ్రామీణ పేద విద్యార్థుల భవిష్యత్తును మార్చగల విద్యా విప్లవానికి నాంది అని కొనియాడుతున్నారు.



రాయిచేడ్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు (ఫైల్)

## మిత్రుడి జన్మదిన వేడుకలకు వచ్చి

# మృత్యు ఒడిలోకి..

### ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు యువకులు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- భూత్పూర్ వద్ద ఎన్‌హెచ్-44పై ఘటన

**భూత్పూర్,జూన్ 16,ప్రభాతవార్త :** ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టి జన్మదిన వేడుకలకు హాజరైన ఇరువురు యువకులు మృతి చెందిన విషాదకర సంఘటన మంగళవారం తెల్లవారుజామున భూత్పూర్‌కు సమీపంలోని జాతీయ రహదారి-44పై జరిగింది. వివరాల్లోకి వెళితే మహబూబ్‌నగర్‌కు చెందిన అఖిల్,అమిస్తాపూర్‌కు చెందిన గొల్ల పెద్దరాజు (21), ఎండి ఇమ్రాన్(23) ముగ్గురు మంచి స్నేహితులు. అయితే అఖిల్ బర్త్‌డే వేడుకలు జరుపేందుకు అమిస్తాపూర్‌కు వచ్చి తన ఫ్రెండ్స్‌తో బర్త్‌డే వేడుకలు ఘనంగా జరిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా ముగ్గురు స్నేహితులు బైక్‌పై మంగళవారం తెల్లవారుజామున ఒకటిన్నర గంటల సమయంలో టీ తాగేందుకు అమిస్తాపూర్ నుంచి భూత్పూర్ మునిరంగస్వామి ఆలయానికి వెనక జాతీయ రహదారి-44కు ఆనుకుని ఉన్న హోటల్‌కు వచ్చి టీతాగి ముగ్గురు బైక్‌పై అమిస్తాపూర్‌కు తిరుగు ప్రయాణంలో రోడ్డుపక్కనే నో పార్కింగ్ ఏరియాలో ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న అమిస్తాపూర్‌కు చెందిన గొల్ల పెద్దరాజు (21), ఎండి ఇమ్రాన్(23) అక్కడికక్కడే మృతి చెందారు. కాగా,తీవ్రంగా గాయపడిన అఖిల్‌ను జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అఖిల్ ఉస్మానియాలో చికిత్స పొందుతున్నారని భూత్పూర్ పీఎస్ ఎస్సై నాగన్న తెలిపారు. మృతుడు గొల్ల పెద్దరాజు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై నాగన్న తెలిపారు.



మృతి చెందిన గొల్ల పెద్దరాజు, ఎండి ఇమ్రాన్ (ఫైల్ )

# 20ఏండ్లు కఠిన కారాగార శిక్ష

- రూ.లక్ష జరిమానా విధింపు
- పోక్సో కేసులో ప్రత్యేక కోర్టు తీర్పు



4



అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ ప్రియాంక

## జాజాపూర్ పాఠశాల వందశాతం

# ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలి
- ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించాలి
- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, జూన్ 16 ప్రభాత వార్త :** నారాయణపేట మండలం జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి తమ జీవిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆమె.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు రావడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో జాజాపూర్ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. గతంలో నారాయణపేట జిల్లా నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపికైన విషయాన్ని గుర్తుచేస్తూ, జాజాపూర్ పాఠశాల నుంచి కూడా విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావాలని కోరారు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, బట్టీ విధానానికి స్వస్తి – మిగతా4లో..

# యూరియా పంపిణీ పారదర్శకత ఉండాలి

- ఎరువుల నిల్వలు, ఆన్‌లైన్ పంపిణీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్
- యూరియా పంపిణీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- నిల్వలు, విక్రయాలపై ఆరా



స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ


**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త:** ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని గ్రోమోర్ క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించి యూరియా నిల్వలు, ఆన్‌లైన్ పంపిణీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పరిమాణం, రైతుల అవసరాలు, రాబోయే రోజుల్లో ఉండే డిమాండ్‌కు అనుగుణంగా నిల్వల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దుకాణంలో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, మున్సిపల్ అనుమతులు, నానో యూరియా, నానో డీఏపీ వంటి ఉత్పత్తుల లభ్యతపై కూడా వివరాలు సేకరించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు నిరంతరాయంగా ఎరువులు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ రైతులకు ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతున్న యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. రైతుల ఆధార్ ధృవీకరణ, బయోమెట్రిక్ నమోదు, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల ద్వారా జరుగుతున్న విక్రయాల విధానాన్ని పరిశీలించి, ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ కేంద్రంలో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల నమోదులు, రోజువారీ లావాదేవీల వివరాలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల సరఫరా మరియు విక్రయాల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. యూరియా పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా కోఆపరేటివ్ అధికారి రఘునాథ్ రావు, ఆర్డీవో సురేష్ బాబు, నాగర్‌కర్నూల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి పూర్ణచంద్రారెడ్డి, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, సంబంధిత శాఖల అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు, ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో

# వనపర్తి భేష్

- హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం
- జిల్లా పోలీసుల పనితీరుపై ప్రశంసలు
- జిల్లా పోలీసు పనితీరుపై సమగ్ర సమీక్ష

**వనపర్తి, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి పోలీసులు అండగా ఉన్నారనే నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని మల్టీ జోన్2 హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం, పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఐజీపీ జోగులాంబ జోన్7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, తో కలిసి సందర్శించి జిల్లా పోలీసు పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐజీపీ, డీఐజీ లకు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐజీపీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి జిల్లాలో నమోదైన యూఐ, గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, కాంటెస్టెడ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ పోక్సో, ఎస్సీ/ఎస్టీ కేసుల్లో 60రోజులలోపు దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసుకు స్పష్టమైన "ప్లాన్ ఆఫ్ యాక్షన్" ఉండాలని, – మిగతా4లో..





సమావేశంలో పాల్గొన్న ఐజిపి డిఐజి జిల్లా పోలీసు యంత్రాంగం



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

## విద్యా ప్రమాణాల పెంపుపై

# ప్రత్యేక దృష్టి

- గణితం, సైన్స్, ఇంగ్లీష్‌పై ఫోకస్ పెంచాలి
- ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కావొద్దు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


**వనపర్తి, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరుగుతున్న నూతన విద్యార్థుల

4

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలి
- ఇద్దరు వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- ఎస్ఐఆర్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి
- కస్తూర్బా పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించాలి
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

4

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



ఇసుక ర్యాంపు వద్ద ఇసుక నిల్వలను, సరఫరాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త:** పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం తాడూరు మండలం అంతారం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గంగాధర్ గౌడ్ తల్లి కళమ్మ మృతి చెందడంతో మంగళవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా॥ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కళమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి గంగాధర్ గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కాంగ్రెస్ పార్టీ మరియు తాను ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాపై పూర్తిస్థాయిలో పరిశీలన

**గద్వాల జూన్ 16, ప్రభాతవార్త:** జల్లాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో కుళ్లిపోయిన విషపూరిత పాములు , వాటి ఎముకలు ఉన్నాయనే అంశంపై సోషల్ మీడియా, వివిధ దినపత్రికలలో గద్వాల జిల్లా ఎడిషన్‌లో ఈనెల 13న ప్రచురితమైన వార్తను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించినట్లు కార్య నిర్వాహక ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్, మైక్రోబయాలజిస్ట్, ఎంపీఓ, గ్రామ కార్యదర్శి మరియు గ్రామ సర్పంచ్ సమక్షంలో జల్లాపూర్ గ్రామంలోని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, ఇంట్రా పైప్‌లైన్లు మరియు తాగునీటి సరఫరా వ్యవస్థను పూర్తిస్థాయిలో తనిఖీ చేయడంతో పాటు తాగునీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో నాణ్యత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షించిన నీటి నమూనాల నివేదికల ప్రకారం తాగునీటిలో ఎటువంటి కలుషిత లక్షణాలు, విషపూరిత పదార్థాలు లేదా హానికర అవశేషాలు లేవని స్పష్టంగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. తాగునీటి నాణ్యత నిర్దేశిత ప్రమాణాలకుఅనుగుణంగా ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల ద్వారా ధృవీకరించబడిందని పేర్కొన్నారు. కాబట్టి జల్లాపూర్ గ్రామ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో కుళ్లిపోయిన పాములు లేదా వాటి ఎముకలు ఉన్నాయనే వార్త పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఇటువంటి పుకార్లు మరియు నిరాధార వార్తలను విశ్వసించవద్దని కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. తాగునీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## చిన్నారి విద్యార్థులను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలి

● అమ్మ మాట అంగన్వాడీ బడి బాటలో సూపర్వైజర్ భాగ్యలక్ష్మీ



**కోయిలకొండ జూన్16, ప్రభాత వార్త :** కోయిలకొండ మండలం కొత్లాబాద్ గ్రామంలో మంగళ వారం అమ్మ మాట అంగన్వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి అంగ న్వాడీ సూపర్వైజర్ భాగ్యలక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారి విద్యార్థులను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగ న్వాడీ కేంద్రాలలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికారం లభించడం జరుగుతుందన్నారు. గ్రామంలో మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులందరిని అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని ఈ సందర్భ ంగా ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులంతా అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్ వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాల కు పంపించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కాంత రెడ్డి, వార్డు సభ్యులు రమేష్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు పుష్ప, అమృతమ్మ, భారతి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యను పెంచాలి


**వెల్దండ, జూన్ 16 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలను ఎంఈఓ చంద్రుడు సందర్శించి గ్రామ సర్పంచ్ కొండల్‌యాదవ్‌తో కలిసి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల నమోదు ఎక్కువగా పెంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేటు పాఠశాలలకు గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించొద్దని కోరారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, సిఆర్పి వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు తదితరులు ఉన్నారు.

## జూన్ 20న రెండవ జాతీయ లోక్ అదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల జూన్ 16, ప్రభాతవార్త:** ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, సులభంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లా డుతూ, 2026 జూన్ 20న నిర్వ హించనున్న రెండవ జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు ఒక గొప్ప అవకాశం అని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర రాజీ ద్వారా తక్కువ సమయంలో పరిష్కరించుకునే వీలు ఈ వేదిక ద్వారా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివా దాలు, కుటుంబసమస్యలు వంటిఅనేక అంశాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు కోర్టు చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గి, సమయం, వ్యయం రెండూ ఆదా అవుతాయని ఆయన వివరిం చారు. అదేవిధంగా లోక్ అదాలత్ ఒక శాంతియుత, రాజీ విధానంలో జరిగే పరిష్కార ప్రక్రియ కావడంతో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలను స్నేహ పూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ విధానం ద్వారా కోర్టు కేసులు త్వరగా ముగిసి, ప్రజల్లో పరస్పర సౌహార్ద వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని ప్రజలు తప్పకుండా వినియోగించు కోవాలని జిల్లాఎస్పీ విజ్ఞప్తి చేశారు. న్యాయంత్వరగా అందించడంలో లోక్ అదాలత్ ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తనాలు పరిశీలిస్తున్న ఏవో సైదయ్య యాదవ్

**పెద్దమందడి, జూన్ 16 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలంలోని పట్టి లైజర్ షాపుల్లో రైతులకు నకిలీ విత్తనాలను విగ్రహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మండల అధికారి సైదయ్య యాదవ్ అన్నారు. మంగళ వారం వెంకటేశ్వర షాపులో విత్తనాలు వ్యవసాయ అధికారి సైదా యాదవ్ పరిశీలించారు. పత్తి విత్తనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు లు విత్తనాలు తీసుకునేటప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు తీసుకున్నాక యజమాన్యాలతో రసీదులు తీసుకోవాలన్నారు. విత్తనాలు తీసుకున్న రైతుల పేర్లు రిజిస్టర్లోని నమోదు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని వర్షాకాలం సీజన్ కావడంతో రైతులు వ్యవసాయానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

## పార్టీలకు అతీతంగా అర్హులందరికీ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**దేవరకద్ర, జూన్16 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందని గుడిబండ గ్రామ సర్పంచ్ నర్సింలు అన్నారు. మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో గుడిబండ గ్రామానికి చెందిన తెలుగు చంద్రమ్మ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కును గ్రామ సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా, అర్హతను ప్రామాణికంగా తీసుకొని చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుంది అన్నారు. అనంతరం లబ్ధిదారులైన తెలుగు చంద్రమ్మ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి, గ్రామ సర్పంచ్ నర్సింలుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరాలను చేయాలనదే ప్రభుత్వ లక్ష్యం

● గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జూన్16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతను కల్పిస్తుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిఅన్నారు. మంగళవారం గద్వాల నియోజక వర్గంలో ధరూర్ మండల కేంద్రంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక సభ్యులకు ఆరోగ్య పరీక్షలు (హెల్త్ స్క్రీన్)కు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో మహిళా సంఘాల కు ఎక్కడ లేని విధంగా వినూత్న కొత్త పథకాన్ని అమలు చేసి గ్రామాలలో స్వయం సహాయక సంఘాలలో ఉన్న ప్రతి ఒక్కరికి మండలలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు రక్త పరీక్షలు నిర్వహించి 30 రకాల పరీక్షలను చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని కూడా ప్రభుత్వం కాపాడడానికి అండగా ఉంటుందని తెలిపారు. నెల రోజులకు ఒకసారి ప్రతి ఒక్క మహిళ ఆరోగ్య సంబంధించిన పరీక్షలను చేయించుకోవాలని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంలో అందరూ కూడా ఆరోగ్యంగా ఉండడానికి సాధ్యమవుతుంది అని తెలపారు. మహిళలు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రభుత్వం రుణాలను ఇచ్చి మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేయడం జరుగుతుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరాలను చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఇప్పటికే ధరూర్ మండలం మహిళా సమైక్య ద్వారా ఆర్టీసీ బస్సు ను కేటాయించడం జరిగిందని, వారికి ఆర్టీసీ ద్వారా 70 వేల రూపాయలు మండల ఖాతాలో నమోదు కావడం జరుగుతుంది అని తెలిపారు. త్వరలోనే ధరూర్ మండల కేంద్రంలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు స్థలం సేకరించడం జరుగుతుందని, అదేవిధంగా మహిళలకు వ్యాపార విధంగా అభివృద్ధి చెందాలని వ్యాపార సంస్థలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా వారికికావాల్సిన రుణాలు ప్రభుత్వంనుండి వచ్చే విధంగా సబ్సిడీ, మహిళా సంఘాల ద్వారా వచ్చే రుణాలను అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ధరూర్ సర్పంచులు సంఘం అధ్యక్షులు డి.ఆర్. విజయ్, జిల్లా మహిళా సమైక్య సెక్రెటరీ సంగీత, తహసీల్దార్, ఎంపిడిఓ, మండల వైద్యాధికారాలు, సిబ్బంది, నాయకులు సంజీవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంద శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తి

● వరి ధాన్యం కొనుగోలులో జోగులాంబ గద్వాల జిల్లా ముందంజ

● నిరంతర పర్యవేక్షణతో కొనుగోలు ప్రక్రియ విజయవంతం

● గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల జూన్ 16, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు, వంద శాతం కొనుగోలుతో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికార యంత్రాంగం ఆయా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్య వేక్షించడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ ను విజయవంతం చేశామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 76 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రబీ సీజన్లో జిల్లావ్యాప్తంగా దొడ్డు రకం వరి 731 హెక్టార్ల లో సాగు చేయగా 5487 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. అలాగే సన్నరకం వరి 30,576 హెక్టార్లలో రైతులు సాగు చేయగా 2,29,323 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు చెప్పారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు మొత్తం రూ.121.18 కోట్ల విలువైన 50,725 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని చెప్పారు. రైతులకు ఇప్పటికే ఈ డబ్బులను చెల్లించడం జరిగిందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్‌లు, తేమ కొలిచే మీటర్స్, ఎలక్ట్రానిక్ తూకాలు, ప్యాడి క్లీనర్స్, తదితర కొరత లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. తరగు, తాలు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరించకుండా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యమును కూడా కొనుగోలు చేశామని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు విషయంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో వాట్స్ అప్ గ్రూపులు ఏర్పాటు చేసి విషయాన్ని తెలుసుకుని, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేసిన సంబంధిత అధికార యంత్రాంగానికి, సహకరించిన ప్రతి ఒక్కరికిఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న ఏబీవీపీ నాయకులు

**వెల్దండ, జూన్ 16 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వెల్దండలో బీసీ వసతి గృహానికి నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి వంశీగౌడ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న బాలుర వసతి గృహం ప్రస్తుతం అత్యంత శిథిలావస్థకు చేరుకుంది. ఈ వసతి గృహంలో నివసిస్తున్న పేద బడుగు, బలహీన వర్గాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని, అలాంటి విద్యార్థులకు కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత కానీ బాలుర వసతి గృహ పరిస్థితి చూస్తే ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల ఎంత నిరక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుంది. వర్షాకాలంలో పైకప్పులు నుండి వర్షపు నీరు రావడం గదులు శిథిలావస్థకు చేరుకోవడం, పరిశుభ్రత లేకపోవడం, సరైన భద్రతా ప్రమాణాలు లేకపోవడం వల్ల విద్యార్థులు భయాందోళనల మధ్య తమవిద్యను కొనసాగిస్తున్నారు. ఈ సమస్యను గతంలోనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాము. నూతన వసతి గృహ భవనాన్ని నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్ట లేదని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని, అవసరమైన నిధులను విడుదల చేసినిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ఒకవేళ మా డిమాండ్లను ప్రభుత్వం నిరక్ష్యం చేస్తే, రానున్న రోజులో పెద్ద ఎత్తునఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీక్ష శిబిరాన్ని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్ యాదవ్, శ్రీకాంత్, హరీశ్, శివరాం, శివ చరణ్, శ్రీశైలం, నర్సింహ, చంటి, ఏబీవీపీ పూర్వ కార్యకర్తలు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్16 ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ తెల్కపల్లి యూపీఎస్ రాకొండ పాఠశాలల్లో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎ.రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసి విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించిన డీఈఓ, విద్యార్థుల హాజరు శాతం పెంపుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెల్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చనిప్రోత్సహించారు. ఈ సందర్భంగా డీఈఓ ఎ.రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటుందన్నారు. సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు తల్లిదండ్రు ల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని, విద్యార్థులు పాఠశాలకు నిత్యం హాజరై పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఉపాధ్యాయులు కూడా బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలోమండల విద్యాధికారి శ్రీని వాస్‌రెడ్డి, పాఠశాలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ పండుగ



ఉప్పునుంతలలో ఊరేగింపుగా వెళ్తున్న కురుమ సోదరులు

**ఉప్పునుంతల, జూన్16 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో కురుమ సోదరులు ఎల్లమ్మ పండుగను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన పండుగ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ సందడి నెలకొంది. సంప్రదాయ ఆచారాల ప్రకారం కురుమ సంఘ సభ్యులు దివ్యమైన బల్లెంతో బొడ్రాయి వద్దకు చేరుకుని ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. పూజల అనంతరం భక్తులు శివసత్తులు ఊగుతూ, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి జైజై ధ్వానాలతో ఊరేగింపుగా గ్రామ వీధుల గుండా సాగారు. పండుగ సందర్భంగా మహిళలు బోనాలు, పసుపుకుంకుమలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఎల్లమ్మ తల్లి కరుణా కటాక్షంతో గ్రామంలో సుఖశాంతులు, పంటలు సమృద్ధిగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఊరేగింపు సందర్భంగా శివసత్తుల విన్యాసాలు, భక్తుల భజనలు ప్రత్యేకఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. భక్తులు అమ్మవారి నామస్మరణతో నృత్యాలు చేస్తూ పండుగకు మరింత శోభను తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘ నాయకులు, పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలుపెద్ద సంఖ్యలో పాల్గొని ఎల్లమ్మ తల్లికి భక్తిపూర్వకంగా సేవలు సమర్పించారు. పండుగ సందర్భంగా గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ సంస్కృతి ప్రతి ఫలించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## సఖి సెంటర్‌లో మరింత మెరుగైన సేవలు

**గద్వాల జూన్ 16, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్లో మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా సంక్షేమ అధికారి నుషిత తెలిపారు. గత వారం జిల్లా కలెక్టర్ తనిఖీలో గుర్తించిన లోపాలను సవరించేందుకు తక్షణ చర్యలు చేపట్టడం జరిగింది. జిల్లా సంక్షేమ శాఖ అధికారిని నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణ మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రతాఏర్పాట్లు మరియు సిబ్బంది విధి నిర్వహణను సమీక్షించినట్లు మరియు ఇతర అంశాలకు సంబంధించిన లోపాలు గుర్తించబడగా, బాధ్యులైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని, అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపట్టడంతో పాటు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సఖి కేంద్రం ద్వారా మహిళలు మరియు బాలికలకు 24 గంటల అత్యవసర సేవలు, తాత్కాలిక ఆశ్రయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, న్యాయ సహాయం, పోలీసు సహకారం మరియు పునరావాస సేవలు ప్రభుత్వ మార్గదర్శకాలప్రకారం నిరంతరం అందించబడుతున్నాయని తెలిపారు. అవసరమైన మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు బాధిత మహిళలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్నిచర్యలు చేపట్టామని జిల్లా సంక్షేమ అధికారి నుషిత వెల్లడించారు.

## రేపు నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

**గద్వాల జూన్ 16, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ఈ నెల 18వ తేదీన ఐడీఓసీ లోని జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, విద్యార్హతగా ఎస్.ఎస్.సి, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్ ఐజ గద్వాల, అర్సెటి గద్వాల, పిఎంకెకె గద్వాల, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలలో250 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎంప్లాయిమెంట్ కార్డు నమోదు చేసుకోని అభ్యర్థులు జాబ్ మేళా ప్రాంగణంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం చేయించిన సర్పంచ్

**గద్వాల జూన్16, ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నందు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో గ్రామసర్పంచ్ అల్వాల శిరీష, రాజశేఖర్ రెడ్డి అక్షరాభ్యాసం చేయించి, పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా అడ్మిషన్ అయిన విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా మెరుగైన విద్యను అందించే ఉద్దేశంతో ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం, స్కూల్ యూనిఫాం అందజేయడం జరుగుతుందని, గ్రామంలో ప్రతి ఒక బిడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శిరీష, జయలక్ష్మి, అంగనవాడీ టీచర్లు ప్రశాంతి, స్కూల్ చైర్మన్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సాముహిక అక్షరాభ్యసం

**కెటిదొడ్డి జూన్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మండల విద్యాధికారి యన్. విజయ్ భాస్కర్ అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుఅనిత, పాఠశాలసిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

**వెల్దండ, జూన్ 16 ప్రభాతవార్త:** గ్రామాలాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 270 మంది వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కృష్ణయ్య మొదటి రోజు ప్రారంభించి మాట్లాడుతూ వార్డు సభ్యుల విధులు, నిధులు బాధ్యతల గురించి వారికి తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరూ కలిస్తేనే అభివృద్ధి సాధ్యమని, గ్రామపంచాయతీ తీర్మానాలలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మోహన్ లాల్, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు మురహరీచారి, తిరుపతయ్య, నందకిషోర్, అల్తాఫ్, ఆంజనేయులు, హరికృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

## యూరియా కొరత లేదు

మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్

**ఉప్పునుంతల, జూన్ 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో యూరియా ఎరువుల కొరత లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్ స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన మేరకు యూరియానిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్రరమేష్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం రిటైల్, హోల్‌సేల్, మార్క్‌ఫెడ్ గోదాంలో కలిపి సుమారు 2.80 లక్షల యూరియా బస్తాల నిల్వలు ఉన్నాయని జిల్లా అధికారులు తెలిపారని ఆయన అన్నారు. ఇటీవల 27,705 యూరియా బస్తాలు జిల్లాకు చేరగా, మరో విడతలో ఎరువుల సరఫరా కొనసాగుతోందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఒక్కసారిగా అధిక మొత్తంలో యూరియాను కొనుగోలు చేయడానికి ప్రయత్నించవద్దని వ్యవసాయ శాఖ సూచించింది. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకుఎరువుల పంపిణీని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులు అవసరానికి మించి యూరియాను నిల్వ చేసుకోవడం వల్ల ఇతర రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కావున అవసరమైన మేరకే రైతులు ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం సాగు సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు అపోహలు, వదంతులను నమ్మకుండా వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని ఆయన తెలిపారు. యూరియా కోసం ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేదని ఇంట్లో కూర్చుని యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేయవచ్చని ఆయన సూచించారు.

## టీకాలు సమయానుసారం అందించాలి

- గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలి
- మహబూబ్‌నగర్ జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త:** చిన్నపిల్లలకు సమయానుసారంగా టీకాలు తప్పని సరి వేయాలని మహబూబ్‌నగర్ జిల్లా వైద్య శాఖ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బండ్లగేరి వద్ద మాతా, శిశు ఆరోగ్య సేవా కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.ఏ.శ్రీనివాసులు సందర్శించి ఆరోగ్య సిబ్బందితో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. మంగళవారం నుంచి ప్రారంభిచిన "స్టాప్ డయేరియా"కార్యక్రమం సమర్థవంతంగా అమలు జరిపి 5సం.లలోపు పిల్లలు డయేరియా గురికాకుండా ఆరోగ్య కరమైన ఆహారము, సురక్షిత తాగునీరు,పరిసరాల పరిశుభ్రత గురించిఅవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణీ లో రక్తహీనతను నివారించుటకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని, టీటీ ఇంజక్షన్లు సమయనుకూలంగా ఇవ్వాలని అన్నారు.చిన్న పిల్లలకు100 అన్ని టీకాలు సమయానుసారంగా ఇవ్వాలని ఆదేశించారు.


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులు

## సర్కార్ బడిలో సకల వసతులు

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి : మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

**మహబూబ్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మహబూబ్‌నగర్ డిఈఓ విజయ కుమారి ఆకాంక్షించారు.మహబూబ్‌నగర్ జిల్లాలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పిఎస్ వెంకటేశ్వర కాలనీ, పిఎస్ బోయపల్లి పాఠశాలలో పాల్గొని కొత్తగా ఒకటవ తరగతిలో నమోదైన విద్యార్థుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సుధాకర్‌రెడ్డి,మహబూబ్‌నగర్అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, పిఎస్ బోయపల్లి ప్రధానోపాధ్యాయులు హరినాథ్, పిఎస్ వెంకటేశ్వర కాలనీ హెడ్ మాస్టర్ మాధవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

## గోపాల్‌పేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**గోపాల్ పేట్ జూన్ 16 ప్రభాతవార్త:** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు గోపాల్‌పేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి అందజేశారు.జిల్లా కార్యవర్గ సభ్యులు శివన్న ఆధ్వర్యంలో ఎర్రగట్టు తండాకు చెందిన పి.బుచ్చమ్మకు రూ.1,16,000,కొండమ్మకు రూ.12,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మేస్త్రి బాలయ్య, కేతపల్లి వెంకటేష్, కొంకాలి కృష్ణయ్య, వార్డు మెంబర్ సురేష్, కొంకలి వెంకటేష్, గోపాల్ పేట మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, పార్టీ కార్యకర్తలు, మండల నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ వినీత్

**దామరగిద్ద, జూన్ 16 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీత్ మంగళవారం దామరగిద్ద పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిపై ఎస్ఐ నరేష్‌ను అడిగి తెలుసుకునిపలు సూచనలు చేశారు. ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందించాలని, ఏదైనా సంఘటనపై సమాచారం అందిన వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించారు.గ్రామాల్లో రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుల కోసం స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది సౌహార్దపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించాలని తెలిపారు.పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందించాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను కట్టడి చేయాలని,ప్రధాన రహదారులపై భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని సూచించిన ఎస్పీ, రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని ఆదే శించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు చేరువలో ఉండాలని సూచించారు.



పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

## ఎంఈఓను సన్మానించిన ఉపాధ్యాయులు

**అచ్చంపేట,జూన్,16 ప్రభాతవార్త:** నూతనంగా ఎంఈఓ బాధ్యతలను చేపట్టిన తరువాత మొదటి సారిగా పట్టణంలో ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఏంఈఓ శ్రీనివాస మూర్తిని ప్రధానోపాధ్యాయులు బిచ్య నాయక్, శాలువాతో సన్మానించారు. ముందగా సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, నోట్ బుక్కలను అందించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని సూచించారు.విద్యార్థులకు అందించే మెనూ తప్పకుండా పాటించాలని విడులపట్ల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకమ్మ, శశికళ,సాధన, సునీత,కళ్యాణి, ఓఎస్ మౌనిక, సిఆర్పి స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్పునూర్ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలపాలని దీక్ష

**రేవల్లి, జూన్ 16 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని తలుపులూరు గ్రామంలో నిరసన దీక్ష చేశారు.30 కిలోమీటర్ల దూరంలో ఉన్న వనపర్తి జిల్లా నుండి, రేవల్లి మండల పరిధిలోని తల్పునూర్ గ్రామాన్ని 14 కిలోమీటర్ల దగ్గర్లో ఉన్న నాగర్ కర్నూల్ జిల్లాలో కలపాలని గ్రామస్తులు మంగళవారం రీలే నిరాహార దీక్ష అఖిలపక్ష ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యా, వైద్య, వ్యవసాయ మార్కెట్ ప్రతి సదుపాయాలు ఉంటాయని, దగ్గర్లో ఉన్న నాగర్ కర్నూల్ జిల్లాలో తమ గ్రామాన్ని కలపాలని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, భాస్కర్ అల్తాఫ్ గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.

## సూరాపూర్‌లో నూతన పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

**లింగాల,జూన్ 16,ప్రభాతవార్త :** మండల పరిధిలోని సూరాపూర్ గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రంగినేని శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు మంగళవారం గ్రామ సర్పంచ్ శేఖర్‌తో పాటు రెవెన్యూ అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పీహెచ్‌సీ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శేఖర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు అయితే అత్యవసర వైద్య సేవలు గ్రామస్థులకు సులభంగా అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, రంగినేని శ్రీనివాస్‌రావు గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరఫున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ మధు మోహన్

**గద్వాల జూన్ 16,ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (యస్ ఐ ఆర్) రూపకల్పన ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుమోహన్ సూచించారు.మంగళవారం ఐడిఓసి సమావేశపు హాలులో గద్వాల రూరల్ మరియు అర్బన్ బిఎల్ఓలు, బిఎల్ఏలు, సూపర్వైజర్లకు ఓటర్ జాబితా రూపకల్పనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధు మోహన్ మాట్లాడుతూ, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా(ఎస్ఐఆర్)ను పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఈనెల 25 నుండి వచ్చేనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి ఎన్యూమరేసన్ ఫారాలను పంపిణీ చేయాలన్నారు. డోర్ లాక్ ఉన్నట్లయితే ఒకటికి మూడుసార్లు ఇండ్ల వద్దకు వెళ్లి ఫారాలను అందించాలని సూచించారు. డబుల్ ఓటర్లు, చని పోయిన వారి వివరాలను సేకరించి ఓటర్ జాబితా నుండి అట్టి పేర్లను తొలగించాలన్నారు. అర్హత గల ఓటర్లు కచ్చితంగా తమ పేర్లను నమోదు చేసుకోనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, బిఎల్ఓ, బిఎల్ఏ లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

◆ పేదింటి బిడ్డల కళ్యాణం జరుపుతున్న ప్రజా ప్రభుత్వం ◆ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**హన్వాడ, జూన్ 16 ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హన్వాడ మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆడబిడ్డల వివాహాలకు సహాయం చేయడంద్వారా సమాజంలో సమానత్వం తీసుకు రావడమే ఈపథకాల యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబా లపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తు న్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు యాదిరెడ్డి, హన్వాడ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నవనీత, నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, జె. వెంకటయ్య, సర్పంచులు బొట్టు శ్రీను, దీప్తి రఘురాంగౌడ్, సత్యం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌రామకృష్ణ, గ్రామ అధ్యక్షుడు చెన్నయ్య, రాములు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కళ్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఘనప సముద్రం ముంపు రైతులను సమగ్ర సర్వే నిర్వహించి గుర్తించాలి

**ఖిల్లాగణపురం జూన్16, ప్రభాతవార్త;** ఘనపసముద్రం ముంపు ప్రభావిత ప్రాంతాలపై సమగ్ర సర్వే నిర్వహించి అంతాయపల్లి వెంకటం పల్లి తదితర శివాలలోని అర్హులైన రైతులను వెంటనే గుర్తించి శివారుల మధ్య ప్రాంతాల మధ్య వివక్ష లేకుండా అందరికీ సమాన నష్టపరిహారం అందించాలని రైతులు అధికారులను కోరారు. మంగళవారం స్థానిక రైతు వేదిక ఆవరణలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు రాష్ట్రంలో భూములకు పెరిగిన మార్కెట్ వ్యాల్యూ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని అదేవిధంగా ధనపురం నుంచి వనపర్తి వెళ్లే రోడ్డు వైపు భూములకు వంద మీటర్లు వదిలిపెట్టి కరకట్ట నిర్మాణం ఏర్పాటు చేస్తామన్నారని రోడ్డు సైడ్ భూములకు ఎకరా కోటి రూపాయల ధర పలుకుతుందని అట్టి తరుణ దృష్టిలో ఉంచుకొని రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని రైతులు అధికారులను కోరారు.భూములు కోల్పోయిన రైతులకు రిజర్వాయర్ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇటీవల అందించిన నష్టపరిహారంలో కేవలం గణపురం గ్రామ రైతులకే నష్టపరిహారం చెల్లించారని అంతాయపల్లి వెంకటంపల్లి శివారు లోని అర్హులైన రైతులకు పరిహారం అందించకపోవడం బాధాకరమనివెంటనే వారందరినీ గుర్తించిప్రభుత్వం నష్టపరిహారం అందించే భాగంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరికీ ఒకే విధమైన నష్ట పరిహారం నిర్ణయించి అందించాలని కోరారు. వనపర్తి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, ఎమ్మార్వో సుగుణ, నీటిపారుదల శాఖ డిఈఏఈలతో పాటు గణపురం వెంకటంపల్లి, అంతాయపల్లి శివారు గ్రామాలకు చెందిన ముంపు రైతులు పాల్గొన్నారు.


ముంపు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న భూసేకరణ ప్రత్యేక కలెక్టర్

## స్వచ్ఛ పాఠశాల.. స్వచ్ఛ భారత్

**జడ్చర్ల, జూన్ 16, ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర కమిటీ పార్టీ పిలుపు మేరకు జడ్చర్ల పట్టణంలో స్వచ్ఛ పాఠశాల - స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు బీజేపీ జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్‌నాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ పాఠశాలలలో పరిశుభ్రత కార్యక్రమాలను ప్రారంభించారు. జడ్చర్లలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల, పాత బజార్, అర్జున్‌వాడ, ప్రభుత్వ పాఠశాలలలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టి పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగించడం, పాఠశాల ఆవరణలను శుభ్రపరచడం,విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ అభియాన్ దేశంలో సామాజిక ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతఅని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. స్వచ్ఛమైన పాఠశాలలు, స్వచ్ఛమైన గ్రామాలు, స్వచ్ఛమైన పట్టణాల నిర్మాణం ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. ప్రతి కార్యకర్త, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి పౌరుడు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా మోర్చాజిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, నాయకులు నాగరాజు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ పాఠశాల స్వచ్ఛ భారత్‌లో బిజెపి నాయకులు

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

◆ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం
◆ వనపర్తి జిల్లా విద్యాధికారి యాదయ్య


సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న జిల్లా విద్యాధికారి

**పెబ్బేరు జూన్16 ప్రభాతవార్త :** పెబ్బేరు, మున్సిపాలిటీ పెబ్బేరు పట్టణంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా విద్యాధికారి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ప్రీ ప్రైమరీ మరియు ఒకటవ తరగతి విద్యార్థుల చేత అధికారులు, ప్రజాప్రతినిధులు అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సరికొత్తగా48 ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించడం జరిగిందని వెల్లడించారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి ప్రీప్రైమరీ తరగతులు విద్యార్థులకు ఉదయం వేళ అల్పాహార (బ్రేక్‌ఫాస్ట్) కార్యక్రమం మొదలవుతున్నాయని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ మరియు ఉచితయూనిఫాంలను ప్రభుత్వం అందిస్తోందని, కాబట్టి తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు. ఈ అక్షరాభ్యాస మహోత్సవంలో ఏఎంఓ మహానంది, సెక్టోరియల్ ఆఫీసర్లు ప్రతాపరెడ్డి, చంద్రశేఖర్, జిసిడిఓఇందిర, పెబ్బేరు మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎస్. జయరాములు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పార్వతి శివ సాయి, పెబ్బేరు వ్యవసాయ కమిటీ చైర్మన్ ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి పాల్గొన్నారు. అలాగే 7వ వార్డు కౌన్సిలర్ శివ సాయి, 4వవార్డు కౌన్సిలర్ జమ్ములమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. చిన్న రాములు, ఉపాధ్యాయులు స్వాతి, మాధురి, సిడిపిఓ సబితా, రాధ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనం ప్రారంభం

**మద్దూరు, జూన్ 16 ప్రభాతవార్త:** మద్దూరు పట్టణ కేంద్రంలో రూ.1 కోటి 10 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన భవనాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, విద్యా రంగాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మద్దూరు మండలంలో ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు, రహదారులు, గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.అదేవిధంగా ఉమ్మడి మండల పరిధిలో సుమారు రూ.910 కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలల నూతన భవనాలు,పునర్నిర్మాణ పనులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు దోహదపడతాయని అన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమప్ప, పీఏసీఎస్ చైర్మన్ నర్సిములు, మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి జనార్ధన్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంజిరెడ్డి,మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.


సహకార సంఘం నూతన భవనం ప్రారంభిస్తున్న కొడంగల్ ఇన్చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి

## 25న నిర్వహించే నాలుగో విడత సర్జికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

**అచ్చంపేట,జూన్,16ప్రభాతవార్త:** అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఆసుపత్రుల వైద్య సేవలను మరింత మెరుగుపరచే లక్ష్యంతో డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు, మౌలిక సదుపాయాలు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల అందింపుపై సమగ్రంగా సమీక్షించారు.ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ కావాలని, ప్రతి రోగికి సత్వర మెరుగైన వైద్యం అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొంటూ, వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ నెల 25 నుండి నిర్వహించే నాలుగవ విడత మేఘా సర్జరికల్ క్యాంపును నియోజకవర్గ ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.చికిత్స చేయించుకునే వారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శ్రీనివాసులు, సాయి, డా. రామకృష్ణ ,డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. తార సింగ్, డాక్టర్లు మహేష్, ప్రతిప్ రాజ్ , బిక్కులాల్ నాయక్, తేజస్విని ,సుష్మ, అమ్రిన్, సిబ్బంది పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన డిఎంఅండ్ హెచ్ఓ శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, జూన్16 ప్రభాతవార్త:** ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా వైద్య శాఖ అధికారిగా శ్రీనివాసులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోడి ఎం అండ్ హెచ్ ఓడా.ఏ.శ్రీనివాసులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాద పూర్వకంగా కలిసిపూల మొక్క అందచేసి శాలువాతో సన్మానించారు.

## చిన్నారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలి : సర్పంచు చింతగాళ్ళ శ్రీనివాసులు

**ఉప్పునుంతల, జూన్16 ప్రభాతవార్త:** 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు అందే ప్రతి పథకం అందేలా అంగన్ వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు సూచించారు.మండల కేంద్రమైన ఉప్పునుంతల అంగన్ వాడీ కేంద్రం 1,3 సెంటర్ లో చిన్నారులకు సర్పంచు చేతుల మీదుగా ఏక రూప దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారం బాలమృతం, గుడ్లు ప్రతి చంటి పిల్లలకు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులుతో పాటు శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, వార్డు సభ్యులు వీరస్వామి, పాత్కుల కొండలు , అంగన్ వాడీ కార్యకర్తలు అప్పోజు పద్మ, పద్మ , ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**శ్రీరంగాపూర్, జూన్ 16 ప్రభాతవార్త :** మంగళవారం తుడిమేగా రెడ్డి ఆదేశాల మేరకు శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో కంబలాపూర్ గ్రామానికి చెందిన వద్దే మాన్ మన్యం లక్ష రూపాయలు, షేర్ పల్లి గ్రామానికి చెందిన బంగారు రాముడు కి రూ. 9000 ల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగింది. శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విష్ణు ముదిరాజ్ తో పాటు కుమ్మరి గోవిందు, రామచందర్ యాదవ్, షేర్ పల్లి సర్పంచ్ వెంకటయ్య,బహుజన రమేష్ శ్రీనివాసులు రవి వెంకటయ్య కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్‌కు హెచ్‌ఎల్‌బి మ్యాప్ అందజేత

**పెద్దమందడి, జూన్ 16 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల పరిధి లోని సర్కిల్ నెంబర్ 011 కు సంబంధించిన హెచ్ఎల్బి మ్యాప్స్ నెంబర్లు 66, 67,68,69, 70,71,72,73,74 లను పెద్ద మందడి తహసిల్దార్ మల్లికార్జున్‌కు మంగళవారం అధికారికంగా సమర్పించారు.ఈ మ్యాప్లను సూపర్‌వైజర్ గద్వాల కృష్ణ సంబంధిత పరిశీలన అనంతరం తహసిల్దార్‌కు అందజేశారు. జనగణన జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో హెచ్ఎల్బి మ్యాప్స్ కీలకపాత్ర పోషిస్తాయని వీటి ఆధారంగా తదుపరి కార్యాచరణ సులభ తరం అవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య కీలకం

◆ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య

**లింగాల, జూన్16 ప్రభాతవార్త:** చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని వారు పాఠశాలల్లో చేరే నాటికి అక్షరాలు అంకెలు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం చేపట్టిందని పూజారి పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య అన్నారు.మంగళవారం లింగాలలోని రెండవఅంగన్వాడి కేంద్రంలో లో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూడేళ్లు దాటిన పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను వివరించి ప్రీ ప్రైమరీ స్కూల్‌కు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పిల్లలు మానసిక ఒత్తిడికిలోను కాకుండా చదువు పట్ల ఆసక్తి కలిగే విధంగా నిపుణులు రూపొందించిన సిలబస్ ను ఆటపాటలతో అంగన్వాడీలో బోధిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల వాతావరణం అలవాటు పడే విధంగా చిన్నారుల ఉజ్వలభవిష్యత్తుకు పునాదిగా అంగన్వాడి కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య, మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులునాయకపు వీరాస్వామి,మూడవ వార్డు సభ్యులు గుత్తి వెంకటయ్య, అచ్చంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తార్, సింగిల్ విండో డైరెక్టర్ శంకర్ నాయక్, అంగన్‌వాడీ టీచర్ గీత తదితరులు పాల్గొన్నారు.

## సింగోటం ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

**కొల్లాపూర్,జూన్16,ప్రభాతవార్త:** నిత్యం వినూత్న కార్యక్రమాలతో నూతన వరవడి సృష్టించే సింగోటం చిన్నబడి మరో ఘనమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడి అంటే బందీఖాన కాదు బడి అంటే భవిష్యత్తును ఇచ్చే ఆకర్షణీయమైన గుడి అని భావించే సింగోటం గ్రామంలో చిన్న బడి ఉపాధ్యాయులు ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. నూతన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి పి.ఇమ్మానుయేల్ మాట్లాడుతూ "ఈనాటి ప్రభుత్వ పాఠశాలలు అంకితభావంతో కూడిన ఉపాధ్యాయులతో నిండి ఉండటం వల్ల అనేక కార్యక్రమాలతో నిత్యం కళకళలాడుతూ ప్రజల అభిమానాన్ని చూరకొంటున్నాయి.ప్రభుత్వం సంకల్పించిన విధంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ వ్యవస్థకు దీటుగా విద్యార్థులకు బోధన చేస్తూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా మరింత ప్రభావవంతంగాసమాజంతోఅనుసంధానం ఏర్పరచుకుంటున్నాయి అన్నారు. పాఠశాల మొదటి పని దినమే పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు అందించడం అంటే దీంట్లోనే ప్రభుత్వ అంకితభావం, విద్య పట్ల ఉన్న స్పష్టమైన దృష్టి కోణం, అభివృద్ధి పరచాలన్న కాంక్ష తేటతెల్లమవుతుందన్నారు"పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీలత మాట్లాడుతూ" విద్యా వ్యవస్థ పటిష్టత కోసం కంకణ బద్ధులై ఉన్నామని, విద్యార్థులకు బోధన చేయటమే కాక వారి మనసులకు దగ్గరవుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేసే గురుతర బాధ్యత మాకు ఉందన్నారు.తల్లిదండ్రుల శ్రద్ధ, సమాజ సహకారం మాకు తోడైతే మా సింగోటం ప్రభుత్వ పాఠశాలను సమాజం గర్వించే స్థితిలో నిలబెడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులుభృంగి కృష్ణప్రసాద్, మాధంశ్రావ్య,గీత, కడుకుంట్ల, సతీష్, ఎంఐసికో ఆర్డినేటర్ విష్ణు యాదవ్, ఎపిసి చైర్పర్సన్ రాజేశ్వరి, తల్లితండ్రులు రజిత, మాధవి, సుకన్య, బాలీశ్వరి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

◆ ఎంసి తండా సర్పంచ్ నిరంజన్
◆ నీటి సమస్య పరిష్కారం పట్ల డిసి తండావాసులు హర్షం

**లింగాల,జూన్ 16, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ నిరంజన్ అన్నారు. మంగళవారం లింగాల మండలంలోని మల్లోని చెరువు తండా గ్రామపంచాయతీ పరిధిలోని డీసీ తండాలో తాగునీటి సరఫరాకు ఉపయోగించే మోటార్ పనిచేయకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నిరంజన్, ఉప సర్పంచ్ జ్యోతి, వార్డు సభ్యులు వెంటనే స్పందించి మోటార్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామంలో తిరిగి నీటి సరఫరా పునరుద్ధరించబడింది. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టిన సర్పంచ్ నిరంజన్, ఉప సర్పంచ్ జ్యోతి, వార్డు సభ్యులను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని సహకారం అందించారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి

**మదనాపురం, జూన్ 16 ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో మండల కేంద్రం అజ్జకొల్లు గ్రామానికి చెందిన లక్ష్మీ నారాయణ గౌడ్ ఇల్లు సోమవారం కూలిపోయింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పైకప్పు కూలడంతో ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య, సర్పంచ్ మల్లేష్ బాధిత కుటుంబానికి పరామర్శించి ఓదార్చి ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాంతమూర్తి, రాములు గౌడ్, నరసింహ గౌడ్, వార్డ్ సభ్యులు విఘ్నేష్ గౌడ్, అంజి, బాలకృష్ణ, గోవర్ధన్ గౌడ్, గుత్ప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ టాపర్లకు క్లాస్మేట్ నగదు పురస్కారం

**రేవల్లి, జూన్ 16 ప్రభాతవార్త :** రేవల్లి మండల పరిధిలోని తలుపునూరు గ్రామంలో క్లాస్మేట్ క్లబ్ఆధ్వర్యంలో మండలంలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 2025,26 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ టాపర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 1,116 నగదుతో పాటు మెడల్, సర్టిఫికేట్‌ను బహూకరించారు. క్లాస్మేట్ క్లబ్ మండల అధ్యక్షుడు, ఎంఈఓ ఎం. బాల్‌రెడ్డి, ఫౌండర్ వాస రాఘవేందర్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు దర్శి రాజయ్య, పోల శ్రీనివాసులు, క్లబ్ ప్రతినిధి అంబశంకర్, రిటైర్డ్ జీహెచ్ఎం చిదిరి వెంకటశెట్టి, నాగపూర్ ఇన్‌ఛార్జ్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, రేవల్లి కాంప్లెక్స్ హెచ్ఎం ప్రసాద్, ఎస్టీటీ జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, యూటీఎఫ్ అధ్యక్షుడు కృష్ణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

**పెద్దమందడి, జూన్ 16 ప్రభాతవార్త :** పెద్దమందడి మండలంలోని పట్టి లైజర్ షాపుల్లో రైతులకు నకిలీ విత్తనాలను విగ్రహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల అధికారి సైదయ్య యాదవ్ అన్నారు. మంగళవారం వెంకటేశ్వర షాపులో విత్తనాలు వ్యవసాయ అధికారి సైదా యాదవ్ పరిశీలించారు. పత్తి విత్తనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు తీసుకునేటప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు తీసుకున్నాక యజమాన్యాలతో రసీదులు తీసుకోవాలన్నారు. విత్తనాలు తీసుకున్న రైతుల పేర్లు రిజిస్టర్లోని నమోదు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని వర్షాకాలం సీజన్ కావడంతో వ్యవసాయానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

## గట్టుకాడిపల్లిలో ఘనంగా మండల పూజలు

**ఉప్పునుంతల, జూన్ 16 ప్రభాతవార్త :** మండలంలోని గట్టు కాడి పల్లి గ్రామంలో మంగళవారం శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య, సమేత శివ, అభయాంజనేయ స్వామి దేవాలయం లో మండల పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, రక్షాబంధనం, పుణ్యాహవాచనం, హోమం ఉదయం 11 గంటలకు దేవతా విగ్రహాలకు అభిషేకాలు, అర్చన నైవేద్యం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

**చిన్న చింతకుంట, జూన్ 16 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో కళ, సంస్కృతి ధర్మపథం మండలంలోని అల్లిపురం లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను అలరించాయి కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఎల్ల శేఖర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ నృత్య ప్రదర్శనలో సంజన, రిత్విక, నైనిక, భాయ్ భూమిక ,అమూల్య, చరిత , సుదీక్ష , సాత్విక, అక్షర, కీర్తన, రిషిక, రీతు, వర్ణిత, శరణ్య లు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం

### పర్దిపూర్ సర్పంచ్ తెలుగు శివకుమార్

**చిన్న చింతకుంట, జూన్ 16 ప్రభాతవార్త :** గ్రామ ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమని పర్దిపూర్ గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు పర్దిపూర్ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రజలకు శ్రీ సిరి కంటి పరీక్ష కేంద్రం వైద్యులచే కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి పరీక్షలో దూరపు, దగ్గర చూపు సమస్యలు ,తలనొప్పి, కంటిలో నీరు కారడం, కంటి గాయాలు, చిన్న పిల్లలకు కంటి సమస్యలు తదితర కంటి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలు, కంటి పొరలు సమస్యలు ఉన్నవారికి అవసరమైన ఆపరేషన్లు చేయబడతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎంసహాయ నిధి చెక్కుల పంపిణీ

**గోపాల్ పేట్ జూన్ 16 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు చెన్నారం గ్రామంలో సిఎంఆర్ రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఏదుల మండల అధ్యక్షుడు పందెం సుఖేందర్ రెడ్డి అందజేశారు. చెన్నారం గ్రామం ఏదుల మండల్ మిద్దెకుర్వ కరుణాకర్ ,ఎండి షరీఫ్ లకు సీఎంఆర్ఎఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో రేవల్లి మండల అధ్యక్షులు అబ్దుల్ అలి, గ్రామ పార్టీ అధ్యక్షులు బండెల శ్రీనివాస్ రెడ్డి, ముద్దం శ్రీకాంత్ రెడ్డి, బంకల గిరిబాబు,లబ్ధిదారులు కరుణాకర్,ఎండి నవాజ్ ,కోడిగంటి రామచందర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం

**లింగాల,జూన్ 16,ప్రభాతవార్త :** మండల పరిధిలోని అప్పాయపల్లి గ్రామ పంచాయితీ పాశుద్ధ్య కార్మికురాలు బిరుదు పుల్లమ్మ (47) మృతి చెందడం పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ తరఫున మృతురాలి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలను గ్రామ సర్పంచ్ విజయకృష్ణ మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వపరంగా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సర్పంచ్ భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు ఇందిర ఎల్లాస్వామి, పద్మ, నరేష్, సలేశ్వరం, గోస్కా నరేష్, కృష్ణ, గ్రామ సిబ్బంది యాదయ్య, పర్వతాలు, రాములమ్మ,మాజీ ఎంపీటీసీ కాశీనాథం, పర్వతాలు, చంద్రయ్య, శ్రీహరి, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడలో పరస్పర కేసులు

**ధన్వాడ, జూన్ 16 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలో పొలం వివాదం నేపథ్యంలో జరిగిన దాడి ఘటన అనంతరం పరస్పర కేసులు నమోదవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై బాధితుడు హ్యూమన్ రైట్స్ కమిషన్‌ను ఆశ్రయించారు. బాధితుడు తెలుగు హన్మంతు తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 7,2026న మధ్యాహ్నం సమయంలో తన అన్న పొలం వైపు వెళ్తుండగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తనపై గొడ్డలితో దాడి చేశారని ఆరోపించారు. గాయాలపాలైన ఆయనను కుటుంబ సభ్యులు ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. మూడు రోజుల చికిత్స అనంతరం జూన్ 9న ఇంటికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, జూన్ 11న సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు అయినట్లు తెలిపారు. అనంతరం అదే వ్యక్తులు తమపై కూడా పాత తేదీతో ఫిర్యాదు చేసి, తాను, తన అన్నపై కేసులు నమోదయ్యాయని హన్మంతు ఆరోపించారు. ఈ పరిణామాలపై న్యాయం కోసం హ్యూమన్ రైట్స్ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.

## తహసీల్దార్‌కు వినతి

**అచ్చంపేట, జూన్ 16 ప్రభాతవార్త :** అంగన్‌వాడీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసిల్దార్ సైదులుకు అంగన్‌వాడి టీచర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఆర్‌సిఎం 830284 టిఎస్ ఎస్, టీడీజీ సర్క్యులర్లు తక్షణమే రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని కోరారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

**గద్వాల జూన్ 16,ప్రభాత వార్త :** ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని, ఇసుకను బుక్ చేసుకునే వినియోగదారులకు నిబంధనల ప్రకారం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజోలి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా సమీపంలోని తుమ్మిళ్ల ఇసుక ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ర్యాంపు వద్ద సమగ్ర కార్యకలాపాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్కడి రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలు చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజోలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. అక్కడి సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి రంజిత్ కుమార్, కిష్టమ్మ అనే ఉద్యోగులు చాలా రోజులుగా హాజరు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పిహెచ్ సి లో రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. అనంతరం రాజోలి తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిందని, దాని ప్రకారం సంబంధిత అధికారులు ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓ లకు సమగ్రంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చి, ఈనెల 26 నుంచి వారి పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటికి తిరిగి ఓటర్లకు ఎనిమరేషన్ ఫారాలను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూభారతి, సాదాబైనామా, తదితర దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ తహసిల్దార్ కు సూచించారు. రాజోలి కస్తూర్బా విద్యాలయంను కూడా సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ స్టాఫ్ హాజరు పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగారు. విద్యా సంస్థలు పున ప్రారంభమై రెండు రోజులవుతున్న విద్యార్థులు రాకపోవడమేమిటని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు విద్యాలయంకు వచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అక్కడి పలు విభాగాలను పరిశీలించి అడ్మిషన్స్ కోసం వచ్చే విద్యార్థుల కోసం వంట చేయకపోవడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, అదనపు గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం రాజోలి సర్పంచ్‌గంగిరెడ్డి, ఉప సర్పంచ్ సంధ్యారెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పర్యటనలో తహసిల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో సయ్యద్ ఖాన్, మార్క్ఫెడ్ డిఎం చంద్రమోళి, ఎస్సై గోకారి, తదితరులున్నారు.

# ఉత్సాహంగా బడిబాట..సామూహిక అక్షరాభ్యాసం

**మదనాపురం, జూన్ 16 ప్రభాతవార్త :** సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫాం ,మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని సర్పంచ్ సుజాత నాగరాజు,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుధారాణి ప్రధానోపాధ్యాయులు మూలే అంజనేయులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దుప్పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థి కు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ గత సంవత్సరం పదో తరగతి మండల టాపర్ గా నిలిచారు. కార్యక్రమంలో కురుమూర్తి రాయ ఎత్తిపోతల చైర్మన్ రాజవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

### నోట్ బుక్కుల పంపిణీ

**పెద్దమందడి, జూన్ 16 ప్రభాతవార్త :** మండలంలోని మణిగిల్ల ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలు నోటుబుక్కు లను గ్రామ సర్పంచ్ పరిషత్ శ్రీనివాస్ గౌడ్ చేతుల మీద పంపిణీ చేశారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉభయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అడ్డాకుల వెంకట్ నర్సింగ్ బేగం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాల పంపిణీ చేశారు.

### విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం

**ఉప్పునుంతల, జూన్ 16 ప్రభాతవార్త :** సర్కారు బడిలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఉప్పునుంత మండలంలోని కంసానిపల్లి హైస్కూల్ లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ ఎం మేడిపూర్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు భాగ్యరేఖ యాదవ్, మహేశ్వరి, కట్ట ప్రభాకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా వెల్టూరు జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం ఆంజనేయులు, సీనియర్ ఉపాధ్యాయులు రవి శేఖర్, జంగయ్య, సురేందర్, రాజేందర్, వెంకటయ్య,అలీ జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు సన్మానం

**లింగాల,జూన్ 16, ప్రభాతవార్త :** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ శేఖర్ అన్నారు. మండల పరిధిలోని సురాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అలాగే ఇటీవల నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి సీట్లు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సరస్వతి పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం



కంసానిపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

# 20ఏండ్లు కఠిన కారాగార శిక్ష

### రూ.లక్ష జరిమానా విధింపు

### పోక్సో కేసులో ప్రత్యేక కోర్టు తీర్పు

**మహబూబ్‌నగర్, జూన్ 16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి గౌరవ ప్రత్యేక పోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నం. 592/2005కేసు నమోదు చేయగా కేసు దర్యాప్తు అనంతరం నిందితుడిపై పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడు ఎదిరగ్రామ వాసిగా గుర్తించి మహబూబ్‌నగర్‌లోని ప్రత్యేక సెషన్స్ జడ్జి, రేప్ అండ్ పోక్సో కేసుల విచారణ కోర్టు న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడు నేరం చేసినట్లు రుజువు కావడంతో అతనికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కీలక పాత్ర పోషించిన మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి. విజయ్‌కుమార్,ప్రత్యేక ప్రజా అభియోజకులు ఎం.జాన్, కోర్టు లైజన్ అధికారులుగా విధులు నిర్వహించిన బాలకృష్ణ (ఏఎస్ఐ), కృష్ణయ్య (పిసి 3666), శంకర్ (పిసి 2194), రహీమ్ (పిసి 2769) మరియు కేసు డాక్యుమెంటేషన్‌లో సహకరించిన అశోక్‌రెడ్డి (పిసి 1441), సీడీఓ, మహబూబ్‌నగర్ రూరల్ పీఎస్‌లసేవలను జిల్లా పోలీస్ శాఖ ప్రశంసించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, కోర్టులో సమన్వయం,సమర్థవంతమైన వాదనలు వినిపించిన అధికారులందరినీ మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు. బాలలపై జరిగే లైంగిక నేరాల పట్ల జిల్లా పోలీసు శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, ఇలాంటి కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ధన్వాడలో బీజేపీ విజయోత్సవాలు

**ధన్వాడ, జూన్ 16 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలన విజయోత్సవాల సందర్భంగా ధన్వాడ మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రధానమంత్రికి ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరాజ్, పంది రామచంద్రయ్య, మల్లయ్య, ఉమేష్ కుమార్, సురేందర్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, కథలప్ప విష్ణువర్ధన్ రెడ్డి, కురుమూర్తి యాదవ్, చక్రి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బిజెపి నాయకులు

## రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

**మక్తల్ టౌన్, జూన్ 16 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ అల్లూరి పావని జన్మదిన వేడుకలను నిర్మాణంలో ఉన్న 150 పడకల ఆసుపత్రి వద్ద కార్మికుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సివిల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పావని మాట్లాడుతూ, మంత్రి వాకిటి శ్రీహరి, ఆయన సతీమణి వాకిటి లలిత ఆశీస్సులతో చిన్న వయసులోనే కౌన్సిలర్ అయ్యానని, వారికి రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాలం, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్లూరి రవికుమార్, కలాల్ నీల గౌడ్, వల్లంపల్లి గురు రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కౌకుంట్లలో కురుమ సంఘం ఏర్పాటు చేయాలి

**దేవరకద్ర, జూన్ 16 ప్రభాతవార్త:** కౌకుంట్లలో కురుమ సంఘం ఏర్పాటు చేయాలని వెటర్నరీ డా. సుశీల్ గౌతమ్ కు కౌకుంట్ల కురుమ సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. కురుమ సంఘానికి ప్రత్యేక కోట,ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కురుమ సంఘం సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమాల సామాజిక ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి, సంక్షేమ పథకాల అమలులో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అలాగే విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో కురుమలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# జాజాపూర్ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

పలికి అర్థం చేసుకుని చదవాలని విద్యార్థులకు సూచించారు. లెక్కలను సులభంగా ఎలా చేయాలో కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు వివరించారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది లాంటిదని, రాబోయే పదేళ్లలో తాము ఏ స్థాయిలో ఉండాలనుకుంటున్నారో రాసుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికతో కృషి చేయాలని సూచించారు పదో తరగతిలో బాలికల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆనందంగా ఉందని, అమ్మాయిలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని కలెక్టర్ అన్నారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి తన తరపున ప్రత్యేక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రయోగశాల, గ్రంథాలయాన్ని పరిశీలించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేసిన కలెక్టర్ జాజాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరిన చిన్నారులకు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతీ మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశాల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పంపిణీ చేయుటకు అందిన కొత్త పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేసి, కొందరు విద్యార్థులకు స్వయంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాలపై కలెక్టర్ ఆరా తీయగా, ప్రస్తుతం 702 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల పునః ప్రారంభం కాగా ఇప్పటివరకు 65 మంది విద్యార్థులు కొత్తగా చేరారని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటుతుందని భావిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలకు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు లేదా ఇతర మౌలిక వసతులు అవసరమైతే జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వాటికి అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో, ఇంచార్జ్ డిఇఓ యాదయ్య, ప్రిన్సిపల్స్ ఉమాదేవి, చంద్రశేఖర్, ఇతర విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో వనపర్తి భేష్

(మొదటి పేజీ తరువాయి)

రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ డేటా ఎంట్రీపై ప్రత్యేక దృష్టి పోలీస్ స్టేషన్ రికార్డులను నిరంతరం నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఐపీఎస్, ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ,సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, సీసీఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సర్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రిమినల్ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

జాబితాలో మార్పులు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఇఆర్‌ఓలు, నియోజకవర్గ స్థాయిలో ఏఈఆర్‌ఓలు, సమర్థవంతంగా పనిచేయాలని, ఇపిఐసి డిప్యూటీ తహసీల్దార్లు కూడా అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధులు సాధారణ ప్రభుత్వ పనులు కాదని, అత్యంత ప్రాధాన్యమైన బాధ్యతగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్ విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమ షెడ్యూల్‌ను వివరాలుజూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ, సన్నాహకాలు, ముద్రణ పనులు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఓల ఇంటింటి సర్వే జరుగుతుందని చెప్పారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, జూలై 31 నుంచి ఆగస్టు 13 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వాటి పరిష్కార ప్రక్రియ జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు తమ మండలాలకు వెళ్లి జూన్ 17 నుంచి 24 వరకు నిర్వహించే మండల స్థాయి శిక్షణ కార్యక్రమాల్లో బిఎల్‌ఓలు, బిఎల్ఏ లు, బిఎల్ఓ సూపర్వైజర్లు, ఏఈఆర్ఓ లకు సమగ్ర అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ ఆర్ అవగాహనకు సంబంధించి జూన్ 17న జిల్లాస్థాయిలో 2కె రన్, జూన్ 18న అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో 2కె రన్ నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరి ప్రియా పాల్గొన్నారు.

## ఓటు చోరీపై అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

బలహీనపర్చే చర్యలను ఆయన ఖండించారు. తెలంగాణలో కూడా ఇలాంటి కుట్రలు జరిగే అవకాశముందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్రంలో ఒక్క ఓటరు కూడా తన ఓటును కోల్పోకుండా కాపాడటం ప్రతి బిఎల్ఎ బాధ్యత అని స్పష్టం చేశారు. బిఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ, వారు అందించే ఫారాలను ప్రజలచేత సరిగ్గా నింపించి అధికారులకు సమర్పించాల్సిన బాధ్యత బిఎల్ఎ లపైన ఉందన్నారు. ఓటర్లకు ఎల్లప్పుడూ అండగా నిలిచి, వారిలో చైతన్యం కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో వాటిని తిప్పికొట్టాలని, వలస వెళ్ళిన వారి వివరాలను ఓటర్ లిస్టులో ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే గ్రామ స్థాయిలో ప్రతి ఓటరును అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దాన్ని కాపాడటం ప్రతి కార్యకర్త ధర్మమని అన్నారు. అంతకుముందు బిఎల్ఎ శిక్షణ కమిటీ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే ..టి. రాంమోహన్ రెడ్డి బిఎల్ఎలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ,బిఎల్‌ఓలు గ్రామాలకు వచ్చినప్పుడు ఇతర పనులను పక్కన పెట్టి వారితో కలిసి సర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. నెలరోజుల పాటు గ్రామాలలోనే ఉండి ఓటర్ల వివరాలను సమగ్రంగా సేకరించాలని, ఎలాంటి అలసత్వం వహించినా పార్టీకి, ప్రజలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, టి పిసిసి ప్రత్యేక ట్రేనర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, డిసిసి ప్రధాన కార్యదర్శులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సాయిబాబా, రాములు యాదవ్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ సెల్ చైర్మన్ ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, కార్పొరేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా మారెమ్మ బోనాల ఉత్సవాలు

**మక్తల్, జూన్ 16ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో స్థానిక రాయచూరు రోడ్డులో గల మారెమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయానికి భారీగా తరలివచ్చిన మహిళలు బోనాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు